# సిఫ్ట్‌కౌర్‌కు కాంస్యం

## ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్



మ్యూనిచ్: ప్రతిష్టాత్మక ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో భారత్ ఖాతాలో మరో పతకం చేరింది. మహిళల 50మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్‌లో యువ షూటర్ సిఫ్ట్‌కౌర్‌సమ్రా కాంస్య పతకంతో మెరిసింది. గురువారం జరిగిన ఫైనల్లో సిఫ్ట్‌కౌర్ 453.1 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. జెనెట్నె హెగ్ (నార్వే, 466.9), ఎమిలీ జెగ్గీ(స్విట్జర్లాండ్, 464.8) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన ఫైనల్లో ఇది వరకే తన పేరిట ప్రపంచ రికార్డు కల్గి ఉన్న 23 ఏండ్ల సిఫ్ట్‌కౌర్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఫైనల్‌కు ముందు జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో నీలింగ్, ప్రోన్, స్టాండింగ్ విభాగాల్లో సిఫ్ట్‌కౌర్ 592 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది.

# రేపు అపెక్స్ కౌన్సిల్ కీలక భేటీ!

## విజయోత్సవ ర్యాలీల మార్గదర్శకాల రూపకల్పనే ఎజెండా?



ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అపెక్స్ కౌన్సిల్ శనివారం కీలక భేటీ కాబోతున్నది. ఐపీఎల్‌లో గెలిచిన జట్లు నిర్వహించే విజయోత్సవ ర్యాలీలకు పాటించాల్సిన మార్గదర్శకాలు, కొత్త నియమ నిబంధనలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్టు బోర్డు వర్గాల సమాచారం. ఇటీవలే ఐపీఎల్‌లో తొలి ట్రోఫీ నెగ్గిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) నిర్వహించతలపెట్టిన విజయోత్సవ ర్యాలీలో తొక్కిసలాట జరిగి 11 మంది ప్రాణాలు కోల్పోగా 30 మందికి పైగా తీవ్ర గాయాల పాలైన నేపథ్యంలో బీసీసీఐ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలుస్తున్నది. ఈ మీటింగ్‌ను వర్చువల్‌గా నిర్వహించనున్నట్టు సమాచారం.

**ఆర్‌సీబీ ప్రతినిధికి బెయిల్:**

తొక్కిసలాట ఘటనలో అరెస్టైన ఆర్‌సీబీ మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సొసలెకు కర్నాటక హైకోర్టు గురువారం బెయిల్ మంజూరుచేసింది. జూన్ 6న కర్నాటక పోలీసులు.. నిఖిల్‌తో పాటు డీఎన్ఎ ఎంటర్‌టైన్‌మెంట్స్‌కు చెందిన ఇద్దరు ప్రతినిధులను అదుపులోకి తీసుకున్న విషయం విదితమే.

# సన్నాహానికి సై

## నేటి నుంచి ఇంట్రాస్క్వాడ్ పోరు

బెకెన్‌హామ్(కెంట్): ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం టీమ్‌ఇండియా అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్నది. ఇప్పటికే ఇంగ్లండ్ లయన్స్‌తో రెండు అనధికారిక టెస్టు మ్యాచ్‌ల ద్వారా ఇక్కడి పరిస్థితులపై అవగాహనకు వచ్చిన మన క్రికెటర్లు.. శుక్రవారం నుంచి మొదలయ్యే ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్ ద్వారా మరింత తుదికూర్పుపై అంచనాకు వచ్చే అవకాశముంది. ప్రత్యర్థికి తమ ఎత్తులు ఏమాత్రం అంచనా వేయకుండా ఇండోర్‌నెట్స్ ద్వారా ప్రాక్టీస్ చేస్తున్న టీమ్‌ఇండియా క్రికెటర్లు.. నేటి నుంచి భారత్ 'ఏ'తో నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనున్నారు. సన్నాహక మ్యాచ్‌పై బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ మాట్లాడుతూ 'టెస్టు మ్యాచ్‌కు సన్నాహకంగా ఇది ఉపయోగపడనుంది. రోజుకు 90 ఓవర్ల చొప్పున నాలుగు రోజుల పాటు 360 ఓవర్లు ఆడటం ద్వారా ప్లేయర్ల సామర్థ్యాన్ని పరిశీలించే అవకాశం లభిస్తుంది. ఈనెల 20న ఇంగ్లండ్‌తో మొదలయ్యే తొలి టెస్టు కోసం తుది జట్టు కూర్పుపై అంచనాకు వస్తాం. ముఖ్యంగా రవీంద్రజడేజా, కుల్దీప్‌యాదవ్..ఈ ఇద్దరిలో ఎవరిని ఆడించాలనే దానిపై సందిగ్ధత ఉన్నది. దీనికి తోడు ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ మధ్య పోటీ నెలకొన్నది. బుమ్రా ఫిట్‌నెస్‌పై ఎలాంటి ఆందోళనా అవసరం లేదు. పూర్తి స్థాయి మ్యాచ్ ఆడేందుకు అతను సిద్ధంగా ఉన్నాడు' అని పేర్కొన్నాడు.



# సుచి స్థానంలో రాధాయాదవ్

- ఇంగ్లండ్ సిరీస్‌కు భారత జట్టు ఎంపిక

ముంబై: ఇంగ్లండ్ పర్యటన కోసం భారత మహిళల క్రికెట్ జట్టును బీసీసీఐ ప్రకటించింది. ఈనెల 28 నుంచి మొదలయ్యే సిరీస్‌లో టీమ్‌ఇండియా, ఇంగ్లండ్ మధ్య ఐదు టీ20 మ్యాచ్‌లు, 3 వన్డేలు జరుగనున్నాయి. ఇందుకోసం బోర్డు మహిళా సెలెక్షన్ కమిటీ వేర్వేరు జట్లను ఎంపిక చేసింది. ఇటీవలే శ్రీలంకతో సిరీస్ ఆడి గాయపడ్డ యువ క్రికెటర్ సుచి ఉపాధ్యాయ స్థానంలో సీనియర్ ఆల్‌రౌండర్ రాధాయాదవ్‌ను జట్టులోకి తీసుకున్నారు. ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ముందు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన సన్నాహక క్యాంప్‌లో సుచి గాయపడిందని బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది.



# భారత్‌లో తొలి రగ్బీ ప్రీమియర్ లీగ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత్‌లో తొలి రగ్బీ ప్రీమియర్ లీగ్‌కు వేళైంది. ఈ నెలలో మొదలుకానున్న లీగ్ ఆధారిత రగ్బీ ఎస్ టోర్నీలో వివిధ దేశాల ప్లేయర్లు బరిలోకి దిగుతున్నారు. అంతర్జాతీయ స్థాయి ప్లేయర్లతో కలిసి తమ ప్రతిభకు మెరుగులు అద్దుకునేందుకు దేశ రగ్బీ ఆటగాళ్లకు మంచి అవకాశమని నిర్వాహకులు పేర్కొన్నారు. జీఎంఆర్ రగ్బీ ప్రీమియర్ లీగ్ కోసం ఇండియన్ రగ్బీ ఫుట్‌బాల్ యూనియన్(ఐఆర్ఎఫ్‌యూ)తో క్యాప్‌జెమిని సంస్థ తమ భాగస్వామ్యాన్ని అందించనుంది. రగ్బీ 7ఎస్ ఫార్మాట్‌లో జరిగే ఈ లీగ్‌లో ప్లేయర్ల ప్రదర్శన మెరుగు పర్చడం, ఆటగాళ్ల ప్రొఫైల్స్‌ను అభివృద్ధి చేయడంలో ఈ సంస్థ సహకరించనుంది. ఈ కార్యక్రమంలో ఇండియన్ రగ్బీ ఫుట్‌బాల్ యూనియన్ అధ్యక్షుడు రాహుల్ బోస్, జీఎంఆర్ స్పోర్ట్స్ సీఈవో సత్యం త్రివేది, క్యాప్‌జెమిని సీఈవో అశ్విన్ పాల్గొన్నారు.

# ఆసీస్‌కు ఆధిక్యం

- 218 పరుగుల లీడ్‌లో కంగారూలు
- రెండో ఇన్నింగ్స్‌లో 144/8
- నిప్పులు చెరిగిన రబాడా, ఎంగిడి
- ఫస్ట్ ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 138 ఆలౌట్



ఎంగిడి (3/35)

లార్డ్స్: దక్షిణాఫ్రికాతో లార్డ్స్ వేదికగా జరుగుతున్న ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా కీలక ఆధిక్యం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో తక్కువ స్కోరుకే వెనుదిరిగినా బంతితో సఫారీల పనిపట్టిన కంగారూలు.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 218 పరుగుల భారీ ఆధిక్యంతో మ్యాచ్‌పై పట్టు బిగించారు. రెండో రోజు ఆటలో దక్షిణాఫ్రికాను 138 పరుగులకే కట్టడి చేసిన కమిన్స్ సేన.. తొలి ఇన్నింగ్స్‌లో 74 పరుగుల విలువైన ఆధిక్యం దక్కించుకుంది. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చి ఆట ముగిసే సమయానికి 144/8 చేసింది. సఫారీ పేసర్లు లుంగి ఎంగిడి (3/35), కగిసో రబాడా (3/44), వియాన్ మల్డర్ (1/14) ధాటికి టాపార్డర్, మిడిలార్డర్ విలవిల్లాడినా వికెట్ కీపర్ బ్యాటర్ అలెక్స్ క్యారీ (43), మిచెల్ స్టార్క్ (16*) నిలబడటంతో కంగారూలు 200+ లీడ్ సాధించారు. అంతకుముందు ఆసీస్ సారథి పాట్ కమిన్స్ (6/28) విజృంభణతో దక్షిణాఫ్రికా కుదేలైంది. తొలి రోజు మాదిరిగానే పచ్చిక పిచ్‌పై ఇరు జట్ల పేసర్ల ధాటికి బ్యాటర్లు అష్టకష్టాలు పడ్డారు. రెండో రోజు 13 వికెట్లు నేలకూలగా అవన్నీ పేసర్లకే దక్కాయి. కాగా పేసర్లకు అనుకూలిస్తున్న లార్డ్స్ పిచ్‌పై సఫారీలకు లక్ష్య ఛేదన అంత సులువేం కాదు. మూడో రోజు ఆట తొలి సెషన్‌లో ఆసీస్ తోకను కత్తిరించి.. ఛేదనలో వికెట్లను కాపాడుకుంటేనే ఆ జట్టు బతికి బట్ట కట్టే అవకాశాలుంటాయి.

**ఫస్ట్ సెషన్‌లో నిలకడ**

ఓవర్ నైట్ స్కోరు 43/4తో రెండో రోజు ఆట ఆరంభించిన దక్షిణాఫ్రికా తొలి సెషన్‌లో నిలకడగా ఆడింది. కెప్టెన్ టెంబ బవుమా, బెడింగ్హమ్ ఆసీస్ పేస్ త్రయాన్ని సమర్థవంతంగా అడ్డుకున్నారు. స్టార్క్ 25వ ఓవర్లో బవుమా.. రెండు బౌండరీలు సాధించి సఫారీ స్కోరును 50 పరుగుల మార్కును దాటించాడు. కమిన్స్ వేసిన ఓవర్‌లో స్క్వేర్ లెగ్ దిశగా భారీ సిక్సర్‌తో అలరించాడు. కానీ అతడే వేసిన 40వ ఓవర్లో ఆఫ్‌సైడ్ వేసిన బంతిని బవుమా కవర్స్ దిశగా డ్రైవ్ చేయబోయి.. లబూషేన్ అద్భుతమైన క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. దీంతో 64 పరుగుల ఐదో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. బవుమా స్థానంలో వచ్చిన వెరేన్‌తో కలిసి బెడింగ్హమ్ సఫారీ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. ఫస్ట్ సెషన్‌లో సౌతాఫ్రికా 27 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 78 పరుగులు చేసింది.

**8 ఓవర్లు.. 12 పరుగులు.. 5 వికెట్లు..**

లంచ్ తర్వాత ఆసీస్ సారథి కమిన్స్ విజృంభణతో సఫారీ తొలి ఇన్నింగ్స్ కథ 8.1 ఓవర్లలోనే ముగిసింది. 49 ఓవర్లలో 121/5తో భోజన విరామానికి వెళ్లిన దక్షిణాఫ్రికా.. 12 పరుగుల వ్యవధితో చివరి ఐదు వికెట్లు కోల్పోయింది. లంచ్ తర్వాత కమిన్స్ ఒకే ఓవర్లో.. వెరేన్, మార్కో యాన్సెన్‌ను ఔట్ చేసి ఆ జట్టును కోలుకోలేని దెబ్బకొట్టాడు. మరో రెండు ఓవర్ల తర్వాత అతడే.. సఫారీలు భారీ ఆశలు పెట్టుకున్న బెడింగ్హమ్‌నూ ఔట్ చేసి ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. కేశవ్ మహరాజ్ (7) రనౌట్ అవగా రబాడా (1) వెబ్‌స్టర్‌కు క్యాచ్ ఇవ్వడంతో దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌కు తెరపడింది. దీంతో కంగారూలకు తొలి ఇన్నింగ్స్‌లో 74 పరుగుల ఆధిక్యం దక్కింది.



కమిన్స్ (6/28)

**కంగారూలకు కళ్లెం**

తొలి ఇన్నింగ్స్‌లో కీలకమైన ఆధిక్యం దక్కిన ఆనందం కంగారూలకు ఎంతోసేపు నిలువలేదు. సఫారీ పేస్ దళాన్ని తొలి 10 ఓవర్ల పాటు సమర్థవంతంగా ఎదుర్కొన్న ఆసీస్.. ఆ తర్వాత పట్టు కోల్పోయింది. రబాడా గత ఇన్నింగ్స్‌లో మాదిరిగానే ఒకే (11వ) ఓవర్లో ఖవాజా (6), గ్రీన్ (0)ను ఔట్ చేసి ఆసీస్‌కు డబుల్ షాకులిచ్చాడు. టీ విరామం తర్వాత బంతినందుకున్న ఎంగిడి నిప్పులు చెరిగే బౌలింగ్‌తో కంగారూ మిడిలార్డర్ పనిపట్టాడు. యాన్సెన్.. లబూషేన్ (22)ను వెనక్కిపంపగా స్మిత్ (13), వెబ్‌స్టర్ (7), కమిన్స్ (6) ఎంగిడి పేస్‌కు దాసోహమయ్యారు. 73 రన్స్‌కే 7 వికెట్లు నష్టపోయిన ఆసీస్‌ను అలెక్స్ క్యారీ, మిచెల్ స్టార్క్ ఆదుకున్నారు. వీరిరువురూ ఆసీస్ ఆధిక్యాన్ని 200 పరుగులు దాటించడంతో పాటు ఆ జట్టును పటిష్టస్థితిలో నిలబెట్టారు. అయితే రబాడా.. క్యారీని ఔట్ చేసి 61 పరుగుల ఈ భాగస్వామ్యానికి తెరదించాడు.

**సంక్షిప్త స్కోర్లు**

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 212 ఆలౌట్, దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 138 ఆలౌట్ (బెడింగ్హమ్ 45, బవుమా 36, కమిన్స్ 6/28, స్టార్క్ 2/41); ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్: 40 ఓవర్లలో 144/8 (క్యారీ 43, లబూషేన్ 22, ఎంగిడి 3/35, రబాడా 3/44)

# అగ్రస్థానంలో ఆయుకుమార్, సాక్షి

## జాతీయ మాన్‌సూన్ రెగెట్టా టోర్నీ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హుస్సేన్‌సాగర్ వేదికగా జాతీయ మాన్‌సూన్ రెగెట్టా చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం జరిగిన గ్రీన్‌ఫ్లీట్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ దత్తత తీసుకున్న ఇద్దరు హర్యానా సెయిలర్లు ఆయుకుమార్, సాక్షి చౌన్కర్ దాదాపు స్వర్ణ పతకాలను ఖాయం చేసుకున్నారు. వీరిద్దరు తమ విభాగాల్లో అగ్రస్థానాల్లో నిలిచి సత్తాచాటారు. ప్రతికూల వాతావరణం నేపథ్యంలో ప్రిన్సిపల్ రేస్ ఆఫీసర్ చతుర్వేది కొన్ని పోటీలను ఆపేశారు. మిగతా విభాగాల్లో పోటీలు ముగిసే సరికి అండర్-19జూనియర్స్ మిక్స్‌డ్ డబుల్స్‌లో తనుజ-శ్రవణ్ జోడీ 8 పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది. బాలుర అండర్-19 కేటగిరీలో హృదయ్ జోషి-కార్తీక్ ద్వయం(17), అండర్-18 బాలుర లేజర్ విభాగంలో శరణ్యయాదవ్(12), బాలికల కేటగిరీలో అలియా సబ్రిన్(12) టాప్‌లో ఉన్నారు.

**క్రీడాకారుల నివాళి**

అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై భారత క్రీడాలోకం స్పందించింది. రోహిత్, కోహ్లీతో పాటు బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, హైదరాబాదీ పేసర్ సిరాజ్ ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు నివాళి అర్పించారు.

విమాన ప్రమాద ఘటన చూసి షాక్‌కు గురయ్యా. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలి. వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి
– కోహ్లీ

ఈ దుర్ఘటన నా మనసును తీవ్రంగా కలిచివేసింది. ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు సానుభూతి ప్రకటిస్తున్నాను
– రోహిత్‌శర్మ

ఈరోజు అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరాల్సిన విమానం ప్రమాదవశాత్తు కూలిపోవడం బాధ కల్గించింది. ప్రమాదంలో మరణించిన 242 మంది మృతుల ఆత్మకు శాంతి చేకూరాలి. ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు ఆ దేవుడు మనో ధైర్యాన్ని కల్గించుగాక
– పీవీ సింధు

విమాన ప్రమాదం చాలా బాధ కల్గించింది. జీవితం చాలా విలువైనది. ఈ ప్రమాదంలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి ప్రకటిస్తున్నాను. ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబసభ్యులకు దేవుడు అండగా ఉంటాడని ఆశిస్తున్నాను
– సిరాజ్

**చిత్రం**

# ఆ ఇద్దరిలో ఎవరు?




**అల్లు అర్జున్,** అట్లీ 'AA22xA6'(వర్కింగ్ టైటిల్) మూవీకి సంబంధించిన పూజా కార్యక్రమాలను బుధవారం ఆడంబరాలు లేకుండా సింపుల్‌గా కానిచ్చేశారట. రేపోమాపో షూటింగ్ కూడా మొదలు కానుంది. ఈ సినిమాకు దాదాపుగా ఏడాదిన్నరైనా పట్టొచ్చనేది సినీవర్గాల అంచనా. ఇదిలావుంటే.. 'AA22xA6' తర్వాత త్రివిక్రమ్‌తో బన్నీ చేయాల్సిన పౌరాణిక చిత్రం ఎన్టీఆర్‌కి వెళ్లిందనే వార్త ఇండస్ట్రీలో బలంగా వినిపిస్తున్నది. అదే గనుక నిజమైతే.. అట్లీ తర్వాత మరి బన్నీని డైరెక్ట్ చేసే దర్శకుడెవరు? అనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. అయితే.. తాజా సమాచారం ప్రకారం నెక్ట్స్ బన్నీ సినిమా ప్రశాంత్‌నీల్‌తో ఉంటుందట. దిల్‌రాజు బ్యానర్‌లో ప్రశాంత్‌నీల్ ఓ సినిమా చేయాల్సివుంది. బన్నీ కాల్షీట్లు దిల్‌రాజు దగ్గరున్నాయి. దీంతో.. అట్లీ సినిమా తర్వాత ప్రశాంత్‌నీల్‌తోనే బన్నీ సినిమా ఉంటుందనేది ఇన్‌సైడ్ టాక్. మరో టాక్ కూడా ఉంది. అదేంటంటే.. 'పుష్ప 3'. ప్రస్తుతం రామ్‌చరణ్ సినిమా స్క్రిప్ట్ వర్క్‌లో సుకుమార్ బిజీగా ఉన్నారు. అన్నీ అనుకూలించి, అట్లీ–బన్నీ సినిమా, సుకుమార్–రామ్‌చరణ్ సినిమాలు అటు ఇటుగా పూర్తయి విడుదలైతే.. 'పుష్ప 3' మళ్లీ పట్టాలెక్కే ఛాన్స్ కూడా లేకపోలేదు.



# థియేటర్లకొచ్చి మనస్ఫూర్తిగా నవ్వుకోండి

**'నలుగురు కుర్రాళ్లు** కలిసి చేసే బడ్డీ కామెడీ ఎలా ఉంటుందో.. 'మిత్రమండలి' అలా ఉంటుంది. ఈ సినిమా చేయడానికి మాకు స్ఫూర్తినిచ్చిన సినిమా 'జాతిరత్నాలు'. ఇది యంగ్‌స్టర్స్ అంతా కలిసి తీసిన సినిమా. మేం వాళ్లకు సపోర్ట్ ఇచ్చాం అంతే. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం. థియేటర్లకొచ్చి మనస్ఫూర్తిగా నవ్వుకోండి.' అని బన్నీ వాస్ అన్నారు. ఆయన సమర్పణలో ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'మిత్ర మండలి'. విజయేందర్.ఎస్ దర్శకుడు. కల్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా.విజయేందర్‌రెడ్డి తీగల నిర్మాతలు. త్వరలో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం ఈ చిత్ర టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అగ్ర నిర్మాత అల్లు అరవింద్ టీజర్‌ని ఆవిష్కరించి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఆద్యంతం నవ్వులు పంచేలా ఈ టీజర్ సాగింది. టీజర్‌ని మించిన వినోదాన్ని సినిమా పంచుతుందని దర్శకుడు చెప్పారు. అందర్నీ అలరించే సినిమా ఇదని నిర్మాతల్లో ఒకరైన భాను ప్రతాప నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా హీరో ప్రియదర్శి, కథానాయిక నిహారికలతో పాటు అతిథులుగా విచ్చేసిన అనుదీప్ కె.వి, నిర్మాత ఎస్.కె.ఎన్ కూడా మాట్లాడారు.

# సీనియర్ నిర్మాత కె.మహేంద్ర కన్నుమూత



**సీనియర్** నిర్మాత కావూరి మహేంద్ర(79) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. గుడివాడ తాలూకా దోసపాడులో జన్మించిన కావూరు మహేంద్ర.. ప్రొడక్షన్ కంట్రోలర్‌గా పలు చిత్రాలకు సేవలు అందించారు. తదనంతరం నిర్మాతగా మారి.. గీతా ఆర్ట్స్ పిక్చర్స్, ఏఏ ఆర్ట్స్ సంస్థలను స్థాపించారు. 50కి పైగా చిత్రాలను నిర్మించారు. నిర్మాతగా మహేంద్ర తొలి చిత్రం 1977లో వచ్చిన 'ప్రేమించి పెళ్లి చేసుకో'. ఆ తర్వాత 'ఏది పుణ్యం? ఏది పాపం?', 'ఆరని మంటలు', 'తోడు దొంగలు', 'బందిపోటు రుద్రమ్మ', 'తిరుగులేని మొనగాడు', 'డాకూరాణి', 'ప్రచండ భైరవి', 'కనకదుర్గ వ్రత మహత్మ్యం' తదితర చిత్రాలను నిర్మించారు. ఏఏఆర్ట్స్ సంస్థను స్థాపించి శ్రీహరిని హీరోగా పరిచయం చేస్తూ 'పోలీస్' సినిమా నిర్మించారు. ఆ తర్వాత శ్రీహరితోనే 'దేవా' సినిమా కూడా తీశారు. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా, కాజల్‌ని హీరోయిన్‌గా పరిచయం చేస్తూ 'లక్ష్మీకల్యాణం' సినిమా కూడా నిర్మించారు. ఆయన మరణం పట్ల తెలుగు చలనచిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతిని గురయ్యింది. గురువారం మధ్యాహ్నం గుంటూరులో మహేంద్ర అంత్యక్రియలు జరిగాయి.

# 14న గద్దర్ ఫిల్మ్ అవార్డులు



**'గతంలో** ఎన్నడూ ఎరుగని విమాన ప్రమాదం నేడు జరిగింది. దేశమంతా దిగ్భ్రాంతికి లోనై ఉన్నది. నిజానికి ఈ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి రావాల్సివుంది. కానీ ఈ విషాదం వల్ల ఆయన రాలేకపోయారు. అందుకనే ఆయన తరపున వివరాలు నేనే అందిస్తున్నా' అన్నారు దిల్‌రాజు. ఈ నెల 14న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవ వేడుక వివరాలను తెలియజేసేందుకు గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దిల్‌రాజు మాట్లాడారు. '14ఏండ్ల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ ఫిల్మ్ అవార్డులను నెలకొల్పింది. ఈ నెల 14న వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం. సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం మొదలవుతుంది. 2014 నుంచి 2023 వరకూ ప్రతి ఏడాదీ ప్రథమ, ద్వితీయ, తృతీయ ఉత్తమ చిత్రాలుగా ఎంపికైన మూడు సినిమాలకు అవార్డులు ఇవ్వనున్న విషయం తెలిసిందే. ప్రతి ఉత్తమ చిత్రానికీ హీరో, హీరోయిన్, దర్శకుడు, నిర్మాత ఇలా నాలుగు కేటగిరీల్లో అవార్డులను అందిస్తాం. ఇక 2024కు సంబంధించి, అన్ని కేటగిరీలకూ చెందిన అవార్డులు ఉంటాయి. తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయవలసిందిగా ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా కోరుతున్నాను' అని దిల్‌రాజు చెప్పారు.

# రివాల్వర్ రాణి ఆగమనం



**వివాహానంతరం** సినిమాల్ని బాగా తగ్గించింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. ప్రస్తుతం ఆమె చేతిలో రెండు సినిమాలు మాత్రమే ఉన్నాయి. తాజాగా ఈ భామ 'రివాల్వర్ రీటా' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించబోతున్నది. దాదాపు రెండేళ్ల క్రితం మొదలైన ఈ సినిమా ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకురాబోతున్నది. వినాయక చవితి సందర్భంగా ఆగస్ట్ 27న 'రివాల్వర్ రీటా' సందడి చేయబోతున్నది. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. జేకే చంద్రు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించారు. ఈ సందర్భంగా కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. దీనిని కీర్తి సురేష్ తన సోషల్‌మీడియా ఖాతాల్లో పంచుకుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌లో కీర్తి సురేష్ చేసిన పోరాటాలు, పండించిన కామెడీ హైలైట్‌గా నిలిచాయి. తన కెరీర్‌లో ఇదొక వైవిధ్యమైన చిత్రమని, ఇందులో తొలిసారి యాక్షన్ ఎపిసోడ్స్ చేశానని కీర్తి సురేష్ చెప్పింది. ప్రస్తుతం కీర్తి సురేష్ తమిళంలో 'కన్నివీడి' చిత్రంలో నటిస్తున్నది.

# విప్లవాన్ని రగిలించే యోధుడు



**హీరో గోపీచంద్** తన తాజా చిత్రంలో చారిత్రక యోధుడి పాత్రలో కనిపించనున్నారు. 7వ శతాబ్దం నేపథ్యంలో రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంకల్ప్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మాత. 'గోపీచంద్33' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్నది. గురువారం గోపీచంద్ పుట్టినరోజుని పురస్కరించుకొని స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. మంచుతో కప్పబడిన పర్వతశ్రేణుల నడుమ మొదలైన టీజర్ ఆసక్తికరంగా సాగింది. పొడవాటి జుట్టు, శరీరమంతా గాయాలు, నుదుటిన వీరతిలకం ధరించి యోధుడి పాత్రలో ఆయన కనిపించిన తీరు సర్‌ప్రైజింగ్‌గా ఉంది. 7వ శతాబ్దం నేపథ్యంలో ఇప్పటివరకు ఎవరూ టచ్ చేయని చారిత్రక ఘటనను ఆవిష్కరిస్తూ, చరిత్ర మరిచిపోయిన ఓ అధ్యాయానికి జీవం పోసే చిత్రమిదని మేకర్స్ తెలిపారు. 'అతనో యోధుడు. విప్లవాన్ని రగిలించడానికి సిద్ధంగా ఉన్నాడు' అంటూ చిత్రబృందం ఈ వీడియోను పంచుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రానికి నిర్మాణ సంస్థ: శ్రీనివాసా సిల్వర్‌స్క్రీన్, రచన-దర్శకత్వం: సంకల్ప్ రెడ్డి.

# కోటీశ్వరుడితో పేదవాడి పోరాటం



**'ఎంతపెద్ద** స్టార్స్‌ని అయినా క్యారెక్టర్లగానే చూస్తూ సినిమా తీసే ఫిల్మ్‌మేకర్ శేఖర్ కమ్ముల. 'కుబేర' సినిమాలో కూడా స్టార్స్ కనిపించరు. క్యారెక్టర్లే కనిపిస్తాయి. కచ్చితంగా ఆడియన్స్‌కి ఈ సినిమా న్యూ ఎక్స్‌పీరియన్స్‌ని ఇవ్వబోతున్నది' అని నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్ రావు అన్నారు. ధనుష్ హీరోగా, అక్కినేని నాగార్జున ప్రత్యేక పాత్రలో వారు నిర్మించిన చిత్రం 'కుబేర'. రష్మిక మందన్నా కథానాయిక. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈనెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో చిత్ర నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్ రావు విలేకరులతో ముచ్చటించారు. ''లవ్‌స్టోరీ' సినిమా తర్వాత శేఖర్ కమ్ముల మాకు ఈ ఐడియా చెప్పారు. వినగానే ఈ కథకు ధనుష్ అయితే కరెక్ట్ అనిపించింది. ఆయనకు కథ వినిపిస్తే 20 నిమిషాల్లో ఓకే చేశారు. ఇక ఇందులోని మిలియనీర్ పాత్రకు నాగార్జునను తప్ప మరొకర్ని శేఖర్ ఊహించలేకపోయారు. మోస్ట్ రిచెస్ట్ మ్యాన్ ఇన్ ది వరల్డ్.. ది పూరెస్ట్ మ్యాన్ ఇన్ ది స్ట్రీట్స్.. సింగిల్ లైన్‌లో ఇదే 'కుబేర' సినిమా కథ. తెలుగు, తమిళంలో స్ట్రెయిట్ గానూ, హిందీలో అనువాదంగానూ సినిమా విడుదల కానుంది' అని నిర్మాతలు తెలిపారు. ఇంకా చెబుతూ 'శేఖర్ కమ్ముల సినిమాల్లో ఉండే ఎమోషన్స్ ఇందులోనూ పుష్కలంగా ఉంటాయి. ఈ సినిమాలోని సీన్స్ అన్నీ ముంబయ్‌లోని రియల్ లొకేషన్స్‌లోనే షూట్ చేశాం. గ్రాండ్‌గా 1600 స్క్రీన్స్‌లో రిలీజ్ చేయబోతున్నాం' అని తెలిపారు. తన కుమార్తె జాన్వీకి చిత్రనిర్మాణం పట్ల ఆసక్తి ఉందని, ఆమె త్వరలో నిర్మాతగా మారనున్నదని సునీల్ నారంగ్ తెలిపారు.

# 'కూలీ'లో అమీర్‌ఖాన్



**సూపర్‌స్టార్** రజనీకాంత్ కథానాయకుడిగా లోకేష్ కనకరాజ్ తెరకెక్కిస్తున్న 'కూలీ' చిత్రం నుంచి ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమాలో బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్షనిస్ట్ అమీర్‌ఖాన్ భాగమవుతున్నారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. రజనీకాంత్‌కు తాను వీరాభిమానినని, ఆయన సినిమాలో అవకాశాన్ని ఎప్పుడూ వదులుకోనని, ఎలాంటి పాత్రనైనా చేయడానికి సిద్ధంగా ఉంటానని అమీర్‌ఖాన్ అన్నారు. ఈ సినిమాలో అమీర్ కీలకమైన అతిథి పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఇక అమీర్‌ఖాన్ నటించిన తాజా చిత్రం 'సితారే జమీన్ పర్' ఈ నెల 20న విడుదలకు సిద్ధమవుతున్నది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.